479) సాళంగం/ ఖరహరప్రియ

ప॥ నానాభక్తు లివి నరులమార్గములు । యేనెపానైనా నాతడియ్యకొను భక్తి॥

చ॥ హరికిగా వాదించు టది ఉన్మాదభక్తి । పరుల గొలువకుంటే పతివ్రతాభక్తి ।
అరసి యాత్మ గనుటదియే విజ్ఞానభక్తి । అరమరచి చొక్కుటే ఆనందభక్తి॥

చ॥ అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి । అతనిదాసులసేవే అదియే తురీయభక్తి ।
క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి । ఆతడే గతని వుండుటది వైరాగ్యభక్తి॥

చ॥ అట్టె స్వతంత్రుడౌటే అది రాజసభక్తి । నెట్టన శరణనుటే నిర్మలభక్తి ।
గట్టిగా శ్రీవేంకటేశుకైంకర్యమే సేసి । తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి॥